క్లుప్తంగా

కంది మద్దతు ధర రూ.7550

మండల వ్యవసాయాధికారి కె.రామమ్మ



మాచవరం: కంది పంటకు ప్రభుత్వం రూ.7550 మద్దతు ధర ప్రకటించిందని ఏఓ కె.రామమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ–పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి ఆధార్ కార్డుతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కందులు తేమశాతం 12 శాతం మాత్రమే ఉండాలని, తగిన నాణ్యతా ప్రమాణాలతో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.

పేదలకు అన్నదానం



మాచర్ల: పట్టణంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహణలో భాగంగా నారాయణ సేవను రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి శనివారం నిర్వహించారు. అందులో భాగంగా మాచర్ల రింగురోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్, చెన్నకేశవ స్వామి దేవాలయం, నెహ్రూనగర్ ప్రాంతాలలో అనాధలు, యాచకులు, వృద్ధులతో పాటు 100 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని ఐదేళ్లుగా నిత్యం మెట్టు గోవింద రెడ్డి కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తమ డీఎంకు ఆర్టీసీ ఉద్యోగుల సత్కారం



మాచర్ల: ఉత్తమ డిపో మేనేజర్‌గా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న బత్తుల వీరాస్వామి ఆర్టీసీ ఉద్యోగులు అభినందించారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో డీఎం వీరాస్వామి మాచర్ల అసిస్టెంట్ మేనేజర్ ఎం.ఎఱ్ఱయ్య, సూపరింటెండెంట్ మురళి, గ్యారేజీ ఇన్‌ఛార్జి షేక్ వలి, ఉద్యోగులు వీరారెడ్డి, శ్రీనివాసరావు, యు.శ్రీనివాస్, నరహరితో పాటు పలువురు ఆయనను పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎం బత్తుల వీరాస్వామి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మాచర్ల డిపోను పల్నాడు జిల్లాలో ప్రథమస్థానంలో ఉంచేందుకు ఉద్యోగులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



దుర్గి: రైతులకు ఎంతగానో ఉపయోగపడే మార్క్‌ఫెడ్ కందులు కొనుగోలు కేంద్రాన్ని మండలంలోని ముటుకూరు గ్రామంలో శనివారం ప్రారంభించినట్లు వ్యవసాయశాఖాధికారి అమీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది మద్దతు ధర రూ. 7550గా చెప్పారు. కందిలో తేమ శాతం 12శాతం వుండాలన్నారు. ఇతర వ్యర్థ పదార్థాలు 2 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం, ముఖ్య, పూర్తిగా తయారుకాని గింజలు 3 శాతం, విరిగిన గింజలు 3 శాతం, పురుగు కుట్టినవి 3 శాతం గా నిర్దేశించినట్లు తెలిపారు. మార్కెఫెడ్‌లో అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా నగదు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ హరిగోపాల్, వీహెచ్ఏ, వీఏ మల్లిఖార్జున, రైతులు పాల్గొన్నారు.

పలనాట ఉద్యాన శోభ!

- ఉద్యాన పంటలవైపు రైతుల చూపు
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- ఈ ప్రాంతానికి పూర్తిగా కొత్తయిన ఖర్జూర, తైవాన్ జామ తోటలు సైతం సాగు చేస్తున్న వైనం

కారెంపూడి: మెట్ట ప్రాంతాలుగా పేరుగాంచిన మాచర్ల, పిడుగురాళ్ల నియోజకవర్గాల్లోని రైతాంగం ఉద్యాన పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. కారెంపూడి మండలంలో 23 ఎకరాలలో గడచిన రెండేళ్ల కాలంలో మామిడి, బత్తాయి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్ తోటల సాగును మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రైతులు చేపట్టారు. అలాగే హార్టికల్చర్ కింద కూరగాయలు, పూల తోటల సాగు, షేడ్ నెట్స్‌లో మిరప నారుతో పాటు వివిధ రకాల కూరగాయలు, పూల సాగు జరుగుతోంది. మండలంలోని నరమాలపాడు, ఒప్పిచర్ల, కారెంపూడి, పేటసన్నెగండ్ల, పెదకొదమగుండ్ల, మిరియాల, చినకొదమగుండ్ల, గాదెవారిపల్లె గ్రామాలలో మొత్తం 127 ఎకరాలలో పండ్ల, కూరగాయల పంటల సాగు జరుగుతోంది.



ఒప్పిచర్ల ఎర్రపాలంలో సాగులో ఉన్న ఖర్జూర పంట

నికర ఆదాయం ఇచ్చే పంటలవైపు మొగ్గు..

పల్నాడుకు పూర్తిగా కొత్త అయిన ఖర్జూర, తైవాన్ జామ, సపోటా లాంటి పండ్ల తోటలతో పాటు అరటి, బొప్పాయి పంటల సాగు కూడా కన్పిస్తోంది. ఒకప్పుడు సజ్జ, జొన్న సాగుతో చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్నాటి సీమ సాగర్ రాకతో వరితో పాటు పత్తి, మిరప వంటి వాణిజ్య పంటల సాగు చేసి అభివృద్ధి పథంలో పయనించారు. అయితే రానురాను చీడపీడల బెడద పెరగడం పెట్టుబడులు రెట్టింపు కావడం గిట్టుబాటు ధరలు లభ్యం కాక పోవడంతో ఆ పంటల సాగు ఏమంత లాభదాయకంగా అన్పించకపోవడంతో రైతులు కొత్త పంటల సాగు వైపు ఆలోచనలు చేస్తున్నారు. నికర ఆదాయానిచ్చే పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు.



నరమాలపాడులో జామతోట వద్ద రైతు

అలాగే సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా మిలెట్స్ సాగు అలాగే పచ్చజొన్న, సజ్జ లాంటి పురాతన పంటల సాగును అక్కడక్కడా చేస్తున్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. పండ్ల మొక్కల ఖర్చు ప్రభుత్వమే ఇస్తోంది. ఉపాధి కూలీల ద్వారా గుంతలు తీయించి మొక్కలు కూడా రైతులకు నాటిస్తున్నాం. తర్వాత కలుపు తీయడం, మొక్కలలో అంతర సేద్యం, సస్యరక్షణ ఇతర ఖర్చులు రైతుల కుటుంబ సభ్యులకు జాబ్ కార్డు ద్వారా అందు ఏర్పాటు చేస్తున్నాం. ఏడాదికి ఎకరాకు సగటున రూ.30నుంచి 40 వేల దాకా మొదటి ఏడాది ఆ తర్వాత ఆ మొత్తం తగ్గిస్తూ మూడేళ్ల వరకు సాగు ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుంది. మండలంలో మామిడి, బత్తాయి, నిమ్మ, డ్రాగన్ పంటలు 23 ఎకరాలలో సాగులో ఉన్నాయి. ఇవి వచ్చే ఏడాది ఇంకా పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– కోటిరెడ్డి, ఏపీఓ,
ఎంజీఎన్ఆర్ఈజీఎస్, కారెంపూడి

దీర్ఘకాల ఆదాయాన్నిస్తాయి..



రైతుకు తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే పంటలను సాగు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది. 90 రోజుల్లో చేతికి వచ్చే వివిధ రకాల కూరగాయల సాగు చేపట్టడం లాభదాయకం. కూరగాయలతో పాటు పలు రకాల పూలమొక్కల సాగు కూడా రైతులకు మంచి ఆదాయాన్ని ఇస్తోంది. ఇది క్షేత్ర స్థాయిలో గమనించాను. ఇలాంటి పంటలు సాగుచేస్తే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా అందిస్తుంది. హెక్టారుకు రూ.20 వేల దాకా రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. వీటితో పాటు పండ్ల తోటలు పెంపకం కూడా దీర్ఘకాలం పాటు పెద్దగా ఒడిదుడుకులు లేకుండా స్థిర ఆదాయాన్ని ఇస్తాయి. రైతులు పంటతోటల సాగుకు అనువైన భూములను గుర్తించి సాగు చేస్తే ప్రభుత్వపరంగా చేయూత కూడా అందుతుంది.

– వై.మోహన్, హార్టికల్చర్ ఆఫీసర్, గురజాల

నేడు శ్రీ భగవాన్ గీతా యజ్ఞం

లక్ష మందితో కోటి నామోత్సవం



మాచర్ల: మాచర్ల పట్టణంలో నేడు సర్వజీవ శ్రేయస్సు, సర్వలోక శాంతికోసం కోటి నామోత్సవ యజ్ఞం, శ్రీ భగవద్గీతను నిర్వహించనున్నట్లు పరబ్రహ్మ కాశీవిశ్వనాథ స్వామి తెలిపారు. శనివారం శ్రీశైలం రోడ్డులోని ఆశ్రమంలో ఆయన వివరాలు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సత్సంగాలు నిర్వహిస్తూ భక్తి యోగ కార్యక్రమ పారాయణం జరుగుతుందన్నారు. గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ కాలని ఎదురు ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం లక్షమందితో శ్రీ భగవాన్ గీతా యజ్ఞం, భక్తి యోగా పారాయణంలో భాగంగా కోటి నామోత్సవం నిర్వహిస్తామన్నారు. తెల్లవారుఝామున ఓంకారం, సుప్రభాతం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం యజ్ఞం, కోటి నామోత్సవ కార్యక్రమం లక్షమందితో జరుపుతామన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు కులమతాలకతీతంగా అన్నదానం చేయనున్నామని స్వామీజీ తెలిపారు. నియోజకవర్గ చరిత్రలోనే ఇంతటి భారీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు స్వామి దివ్య ఆశీస్సులు పొందాలన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు) : మండలం దొడ్లేరు గ్రామంలో డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన సదస్సును ఎస్ఐ నాగేంద్రరావు శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. ప్రజలు, యువత మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు ఎవరైనా విక్రయిస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకారం అందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

గురజాల ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం: పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పిల్లుట్లలోని గుర్రం వీరగోపాలకృష్ణారెడ్డి అనాథల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులు పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, అదనపు గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు తమవంతు సహాయ సహకారలు అందించాలని కోరారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, స్వయంగా విద్యార్థులకు వడ్డించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ లఘువరపు శివపార్వతి, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

యోగా, ప్రాణాయామం ఉచిత తరగతులు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో స్వామి వివేకానంద సేవాశ్రమంలో, రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం యోగా, ప్రాణాయామం మెడిటేషన్ క్లాసులు ప్రారంభించారు. అందులో భాగంగా ఉచితంగా పలువురు యువకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి యోగా ప్రత్యేకతలను మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ క్లాసులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ ఉదయం 8గంటలకు జరిగే క్లాసులకు ఎవరైనా హాజరుకావచ్చని సూచించారు.



యోగా మెడిటేషన్ క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఎస్పీవై ఆధ్వర్యంలో...

మాచర్ల: పట్టణంలోని పత్తిఫ్యాక్టరీలో వేంచేసియున్న శ్రీ షిర్డీసాయి జ్ఞాన మందిరంలో ఆదివారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు ఎస్పీవై సంస్థ వ్యవస్థాపకులు సైదయ్య ఆచారి ఆధ్వర్యంలో ధ్యాన యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పందిరి బాల గురవయ్య, గంగిశెట్టి రాధాకృష్ణమూర్తిలు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6గంటలకు జరిగే శిక్షణా తరగతులకు హాజరై ఆరోగ్యంగా ఉండాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 7799295111 నంబరులో సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వేణుగోపాల్

రాజుపాలెం: సైబర్ నేరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వేణుగోపాల్ కోరారు. మండలంలోని పెదనెమలిపురి, వీరమ్మ కాలనీల్లో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దని సూచించారు. జిరాక్స్ సెంటర్‌లో పొరపాటున కూడా వాటిని మరచిపోవద్దన్నారు. మత్తు పదార్థాలకు పిల్లల్ని దూరంగా ఉంచాలని తెలిపారు. ప్రధాన దేవాలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సలహాలు, సూచనలు ఇవ్వండి

పిడుగురాళ్ల: జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూచనలు, సలహాలను రాజకీయ నాయకులు తెలపాలని మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఏఈ రాఘవేంద్ర మాట్లాడుతూ గతంలో పిడుగురాళ్ల పట్టణానికి 329 బూత్ మాత్రమే ఉండేదని, అయితే ఇప్పుడు ఓటర్లు పెరిగినందున 329 ఏ బూత్ కలిపి మొత్తం రెండు బూత్‌లను పట్టణంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అలాగే పిడుగురాళ్ల మండలంలో బూత్ నెంబర్ 330, 331 రెండు బూత్‌లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పట్టణం, మండలానికి సంబంధించిన నాలుగు ఎన్నికల బూత్‌లు పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పురుష ఓట్లు 1911, మహిళల ఓట్లు 961 మొత్తం 2872 ఓట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ ఓట్ల షెడ్యూల్ ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్, ఫిబ్రవరి 10వ తేదీ లోపు నామినేషన్ ప్రక్రియ 11వ తేదీన స్క్రూట్నీ, 13వ తేదీన విత్‌డ్రాలు, ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని అధికారులు తెలిపారు. ఓట్ల జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే ఆయా రాజకీయ పార్టీల నాయకులు తెలపాలని సూచించారు. హాజరైన కొంత మంది రాజకీయ పార్టీ నాయకులు అభ్యంతరాలు ఏమి తెలపలేదని అధికారులు తెలియజేశారు. టౌన్ ప్లానింగ్ అధికారి డి.హృదయరాజు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమీక్ష సమావేశం

విద్యార్థినుల క్షేత్ర పర్యటన

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు అపారల్ ట్రేడ్ కార్యక్రమంలో భాగంగా దాచేపల్లిలోని స్టిచ్చింగ్ సెంటర్‌ను శనివారం క్షేత్ర పరిశీలన చేశారు. అక్కడ కోల్‌కత వారితో నిర్వహిస్తున్న మగ్గం వర్క్స్, స్టిచ్చింగ్, డిజైనింగ్ చేసే విధానాలను విద్యార్థినులు పరిశీలించారు. హెచ్ఎం ఎస్.వెంకట సాంబశివరావు, ట్రైనర్ షేక్ ముంతాజ్ బేగం పాల్గొన్నారు.



కానుకమాత ఆశీస్సులతో మహాన్నదానం

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల మైదానంలో మహాన్నదానం కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించినట్లు చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి తెలిపారు. అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సుమారు 18 వేల మంది భక్తులకు అన్నదానం చేపట్టినట్లు వెల్లడించారు. చర్చి పెద్దలు, జపమాల, నిర్మలమాత, కానుకమాత, ఆరోగ్యమాత, లూర్దుమాత తదితర సభలకు చెందిన మహిళలు ఈ అన్నదాన కార్యక్రమంలో విశేషంగా సేవలు అందించారని వారికి ప్రత్యేకగా కృతజ్ఞతలు తెలిపారు. కానుకమాత చల్లని దీవెనలతో గ్రామంలో ముందెన్నడూ లేనివిధంగా చేపట్టిన ఈ మహాకార్యానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవంలో భాగంగా శనివారం అంథోనివారి కాలనీలోని అంథోనివారి మందిరంలో నవదిన ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో మండాది విచారణ గురువులు రెవ.ఫాదర్ రత్నకుమార్ సహాయ గురువులు రెవ.ఫాదర్ అగస్టీన్‌తో కలిసి పవిత్ర సమష్టి దివ్యబలిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ రత్నకుమార్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రైస్తవులు ప్రతి రోజు దేవునిచే ఎన్నుకోబడిన మేరియతల్లిని ప్రార్థించాలన్నారు. కనికరం కల్గిన మరియతల్లి విశిష్టతను వివరించారు. కథోలిక్కులు కరుణమయురాలైన ఆ తల్లి ఆశీస్సులు తప్పకుండా పొందుతారన్నారు. ఈ దివ్యపూజాబలిలో చర్చి పెద్దలు, కన్యాస్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.



కానుకమాత చర్చిలో నిర్వహించిన మహాన్నదానం

ఇర్లపాడులో న్యాయసేవా సదస్సు

శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో న్యాయ సేవా సదస్సు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరు చట్టాలపై ప్రజలు అవగాహన కల్గియుండాలన్నారు. సివిల్ వివాదాలు గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు నూతన చట్టాలపై గురించి ప్రజల్లో చైతన్యం కల్గియుండాలన్నారు. వైద్యం అనేది ప్రతి ఒక్కరు ప్రాథమిక హక్కు అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేర మని అలా పరీక్షలు చేయించుకున్న భార్యాభర్తలు వైద్యాధికారి కూడా శిక్షకు పాత్రులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహతి

రైల్వే బ్రిడ్జిపై స్టీల్‌గడ్డర్ల పనులు పూర్తి



శావల్యాపురం: శావల్యాపురం కొంకేరు వాగు రైల్వే బ్రిడ్జిపై నూతనంగా చేపట్టిన స్టీల్ గడ్డర్లు ప్రధాన పనులు రైల్వే అధికారుల పర్యవేక్షణలో శనివారంతో ముగిశాయి. గతంలో ఒక్కో స్టీల్‌గడ్డర్ అమర్చడానికి 20 రోజులు పడుతుందని నూతన ఆధునీకరణ సాంకేతిక పరిజ్ఞానంతో రెండు రోజుల వ్యవధి లో 8 స్టీల్‌గడ్డర్లు అమర్చినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే డీఆర్ఎం పర్యవేక్షణలో రైల్వే అధికారులు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టారు. రెండు రోజుల వ్యవధిలో 200 మంది రైల్వే కూలీల సహాయంతో ఆధునీకరణ నాలుగు క్రేన్లు ద్వారా స్టీల్ గడ్డర్లు యుద్ధప్రతిపాదికపై పనులు చేశారు. అలాగే వంతెనపై నడవటానికి అనుకూలంగా ఉండేలా, రైల్వే దిమ్మెలు మరింత పటిష్టంగా ఉండేలా పనులు చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి ఎనిమిదో తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. దీని నిమిత్తం కోర్టులో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలి

తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్

మాచర్ల రూరల్: రేషన్ పంపిణీదారులు నిత్యావసర వస్తువులను సకాలంలో పంపిణీ చేయాలని, ప్రతి కార్డుదారుడికి ఖచ్చితంగా సరుకులు అందేలా చూడాలని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని రాయవరం, పట్టణంలోని పలు ప్రాంతాలలో రేషన్ బియ్యం పంపిణీ వాహనాలను ఆయన అకస్మికంగా తనిఖీ నిర్వహించి మాట్లాడారు. సమయపాలన పాటించి ప్రతి కార్డుదారునికి బియ్యం, కంది పప్పు ఇతర వస్తువులను అందించాలని, ఎవరైనా సాంకేతిక కారణాల పేరుతో పంపిణీ చేయకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ దుకాణదారులు బియ్యం, కంది పప్పు సక్రమంగా పంపిణీ చేయటం లేదని ఫిర్యాదులొస్తున్నాయని వారు సరిచేసుకోకపోతే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామన్నారు. నిత్యవసర సరుకుల పంపిణీపై ఆయా పరిధిలోని వీఆర్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓ ఆరుముళ్ళ నాగేశ్వరరావు తదితరులున్నారు.



రాయవరంలో రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్